

19,20 తేదీల్లో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 19, 20 తేదీల్లో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర రావు ఒక ప్రకటనలో తెలిపారు. శాప్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని తుళ్ళూరు మండలం, మందాదాం న్యూ బై-పాస్ రోడ్‌లో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో సైక్లింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆసక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియెగించుకోవాలని, పూర్తి వివరాలకు కె.కనకారావు, సైక్లింగ్ శిక్షకులు, డిఎస్ఎ గుంటూరు వారిని మొబైల్ నెంబరు 6301177119 సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పర్యాటక కేంద్రంగా విఆర్ఎస్ : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

వెంగళరాయ సాగర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. మండలంలోని అన్నంరాజువలస పంచాయతీ ముచ్చర్లవలస వద్ద గల వెంగళరాయ సాగర్ ప్రాజెక్టులో 4 లక్షల చేప పిల్లలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యం జిల్లాలో పర్యాటకులను ఆకర్షించేందుకు అనేక జలపాతాలు, ప్రాజెక్టులున్నాయని, వీటిని మరింతగా అభివృద్ధి చేయడం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ఇటీవల శిఖపరువు, దళాయవలసతో పాటు ఇతర ప్రాంతాల్లో జలపాతాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా వెంగళరాయ సాగర్ ప్రాజెక్టులో కూడా బోటింగ్ సౌకర్యం కల్పించడానికి బోట్లను, సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేందుకు పార్కును నిర్మిస్తామని ఆమె ప్రకటించారు.

మత్స్యకార కుటుంబాలకు భరోసా



రిజర్వాయర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన గిరిజన కుటుంబాలకు జీవనోపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం కూడా 4 లక్షల చేప పిల్లలను విడుదల చేశామని, ఇది ఇక్కడి గిరిజనులు, మత్స్యకార కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవడానికి సహాయపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. మత్స్యకారులకు మోటార్ సైకిళ్లు, మోపెడ్లు, సైకిళ్లు, చేపలను నిల్వ చేసేందుకు ఐస్ బాక్సులు, వలలు వంటి వాటిని కూటమి ప్రభుత్వం సబ్సిడీపై అందించి ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, తహశీల్దార్ నీలకంఠ రావు, మత్స్యశాఖ అధికారులు, టిడిపి మండల నాయకులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'ముస్తాబు' నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల ముస్తాబు కార్యక్రమం మాదిరిగా ఇకపై పాఠశాలల ముస్తాబు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దాలని, ఆ దిశగా కషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రధాన ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో ప్రధాన ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాలల వాతావరణాన్ని పూర్తిగా మార్చాలని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛను పెంపొందించాలని అన్నారు. పిల్లల ఆరోగ్యంతో పాటు దంత సంరక్షణ కూడా ముఖ్యమని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిట్‌గా ఉండి, ఉతికిన యూనిఫారాలను విద్యార్థులు ధరించేలా చూడాలని తెలిపారు. ముస్తాబు కార్యక్రమాన్ని కఠినంగా అమలుచేయాలని, విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా వారికి అవగాహన కల్పించాలని తేల్చిచెప్పారు. పాఠశాల ప్రాంగణంలో పచ్చని మొక్కలు, పూల మొక్కలతో అందంగా, ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులకు ముస్తాబు వర్తిస్తుందని, శుభ్రంగా లేకుండా ఉపాధ్యాయులు ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. మరుగుదొడ్లు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండాలని, వీటిపి స్ప్రేయర్ల ద్వారా శుభ్రపరచుకునేలా విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు. ప్రతి నెలా ఆటల పోటీలు జరుగుతాయని, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు శిక్షకుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించి, వారిని అథ్లెటిక్స్‌కు పంపడం జరుగుతుందని అన్నారు. అలాగే ప్రతి శనివారం ఆనందలహరి పేరుతో పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, కావున ఔత్సాహిక రచయితలు, కవులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. అనంతరం ముస్తాబు పోస్టరును కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. డిఇఒ బి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ అపార్ ఐడీ చేయిస్తున్నామని, అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శత శాతం హాజరయ్యేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఎంఇఒలు వారి పరిధిలోని పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారని, ప్రతి శనివారం ఆనందలహరితో పాటు యోగా చేయిస్తున్నామని అన్నారు. ఆఖరు పీరియడ్‌లో క్రీడలు, ఆటలు ఆడిస్తున్నామని, పిల్లలకు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ముస్తాబు కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎం. శ్యామల, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎ.విజయశాంతి, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, డిప్యూటీలు డిఇఒలు, ఎంఇఒలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

విఆర్‌ఒ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి విఆర్‌ఒ భూసి తిరుపతిరావు అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారంలో ఆయన పెదబుడ్డిడి బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గుమ్మడి గౌరమ్మ మాట్లాడుతూ తన భర్త రెండేళ్ల క్రితం చనిపోయిన తర్వాత తనకున్న మూడెకరాల భూమిని పోతీ కేసుపై మ్యూటేషన్ చేయడానికి విఆర్‌ఒ రూ.20వేలు లంచం అడిగారని, రూ.5వేలు తొలుత ఇచ్చినప్పటికీ పని కాకపోవడంతో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసేసరికి తన రూ.5వేలు తనకు ఇచ్చేశారని, అయితే తన 20 సెంట్లు భూమి ఇతరులకు ఆన్లైన్ చేశారని వాపోయింది. అలాగే రెడ్డి తవిటినాయుడు కుమారుడు పిల్లలను రేషన్ కార్డులో యాడింగ్ చేయడానికి వెయ్యి రూపాయలు లంచం అడిగారని తెలిపారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ పింఛన్లు వస్తున్న ఇద్దరు మహిళల రేషన్ కార్డులు తీసుకొని మీ రేషన్ కార్డులు రద్దు చేయాలని పైనుంచి అర్డర్ వచ్చిందని, అలాగే మీకు పింఛన్ ఇవ్వడానికి కుదరదని పింఛన్ల రద్దు చేస్తానంటూ మహిళలను భయపెట్టి రాత్రి 7 గంటల వరకు సచివాలయంలో ఉంచినట్టు పలువురు బాధితులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఇవే కాకుండా పలువురు దగ్గర పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం ఫ్యామిలీ మెంబర్లు సర్టిఫికెట్ల కోసం ఇంకా అనేక రకాల పనులు నిమిత్తం డబ్బులు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే ఉన్నతాధికారులు విఆర్‌ఒపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని, లేనిచో బాధితులందర్నీ తీసుకువెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులతో పాటు సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం పాల్గొన్నారు.




సచివాలయం సిబ్బంది కోసం నిరీక్షిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి

సమయపాలన పాటించుకుంటే ప్రజలకు సేవలందేది ఎలా?

ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సేవలందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయాలకు ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించుకుంటే ప్రజలకు ఏ విధంగా సేవలు అందిస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు. జియమ్మ వలస మండలం పెద్ద బుడ్డిడి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన సందర్శించారు. అప్పటికి ఎవరూ విధులకు హాజరు కాకపోవడంతో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకుంటే ప్రజలు సమస్యలను ఎవరికి చెప్పుకుంటారని, ఏ విధంగా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా కింది స్థాయి అధికారులు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సచివాలయాలపై దృష్టి సారించి ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరయ్యాలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

- అర్హులైన రైతు కుటుంబానికి రూ.7 వేలు
- జిల్లాలో 1,22,260 రైతుల ఖాతాలో రూ.83.87 కోట్లు జమ



ప్రజాశక్తి- పార్వతీపురం

రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతలుగా 20 వేల రూపాయలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పిఎం కిసాన్ రూ.6వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం 14వేల రూపాయలు మొత్తంగా రూ.20వేలు అందిస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,22,260 మంది రైతులకు లబ్ధి చేకూరే విధంగా మొదట విడతలో అన్నదాత సుఖీభవ ద్వారా ఒక రైతుకు రూ.5వేలు చొప్పున ఈ ఏడాది ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఆ సమయంలో రైతులకు సాగు ఖర్చులకు ఈ డబ్బులు ఉపయోగపడ్డాయి. రెండో విడత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లా కమలాపురంలో ప్రారంభిస్తారని కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మన్యం జిల్లాలోని పాచిపెంట మండల కేంద్రంలో గల మార్కెట్‌యార్డులో బుధవారం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి పాల్గొని నిధులు విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాలకొండ నియోజకవర్గం లోని రైతులకు రూ.22.75 కోట్లు, కురుపాం నియోజకవర్గంలో రూ.26.94కోట్లు, పార్వతీపురం నియోజకవర్గంలోని 17.20కోట్లు, సాలూరు నియోజకవర్గ పరిధిలోని రైతుల ఖాతాల్లోకి రూ.16.98కోట్లు జమ చేయనున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన రైతు కుటుంబాలకు రూ.7వేలు చొప్పున జమ చేయనున్నారు. రెండో విడత నిధుల కార్యక్రమం జిల్లాలోని లక్షా 22వేల 260 మంది రైతుల ఖాతాలో రూ.83.97 కోట్లు జమ చేస్తారు. అర్హులైన భూమి యాజమాని రైతులకు ఖరీఫ్ లో రూ.7వేలు, రబీలో రూ.7వేలు, వేసవిలో రూ.6వేలు మొత్తంగా కేంద్రం వాటా రూ.6వేలు, రాష్ట్రం వాటా రూ.14వేలు మొత్తంగా రూ.20వేలు రైతు కుటుంబాలకు ఏటా అందజేయనున్నారు. వెబ్‌ల్యాండ్ డేటాలో నమోదైన భూమి యజమాని రైతు కుటుంబాలు, ఆర్ఒఎఫ్ఆర్ భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబాలు కూడా అర్హత లోకి వస్తాయని, ఇకెవైసి తప్పనిసరిగా చేయాలని, జిఎస్‌డబ్ల్యుఎస్ హౌస్ హోల్డ్ డేటా బేస్‌తో అనుసంధానం చేయాలని, మరణం, అర్హత లేని కేసులపై నిరాకరణ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం



మండలంలోని నర్సిపురం గ్రామం సమీపంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మరిశర్ల వెంకటనాయుడు మృతి చెందారు. నర్సిపురం జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లీష్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంటనాయుడు విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటనాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈనెలాఖరున ఉద్యోగవిరమణ చేయనున్న వెంకటనాయుడును మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబలించిందని సహచర ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు ఎమ్ డి చిల్డ్రన్ సూపర్ స్పెషాలిటీ కోసం ప్రయత్నిస్తున్నారు.


యు వెంకంపేటలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని యు.వెంకంపేటలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శుభారాతమని, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

మూడెకరాల్లో వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లిలో వరికుప్పలు దగ్ధమయ్యాయి. చిలకలపల్లికి చెందిన బౌరుపల్లి సాంబమూర్తికి చెందిన సుమారు 3.19 ఎకరాల భూమిని కౌలు రైతుగా పంటను పండిస్తున్నాడు. సుమారుగా 40 వరికుప్పలు అగ్నికి గురై వరి పంట బూడిదైంది. దీంతో సుమారుగా రూ.2లక్షలు వరకూ ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. భూ యజమాని రంగుముద్రి గౌరునాయుడు కౌలు రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చేయగలరని రైతు కోరుతున్నారు. కౌలు రైతు సాంబమూర్తి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు



అగ్నిప్రమాదంలో దగ్ధమైన వరికుప్పలు

దిబ్బ గూడలో నాలుగు వంటపాకలు దగ్ధం

సీతంపేట : మండలంలోని కీసరజోడు పంచాయితీ దిబ్బగూడలో సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి నాలుగు పూరిపాకలు దగ్ధమయ్యాయి. నిమ్మక సత్యం, నిమ్మక చిన్నమ్మి, సున్నాపురం బుడ్డు, నౌగూడ పార్వతికి చెందిన ఇంట్లో సామగ్రి అంతా దగ్ధమైంది. విషయం తెలిసిన వెంటనే మంగళవారం ఉదయం ఆర్ఐ విజయగణేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం ఉంటుందని అంచనాలు వేస్తున్నారు. సర్పంచ్ సున్నాపురం రవి బాధితుల వివరాలు నష్టాలు గురించి అధికారులకు తెలిపారు. బాధితులకు బియ్యం పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- కురుపాం

స్థానిక విజ్ఞాన భారతి ప్రాథమిక పాఠశాల వద్ద 'సప్తశక్తిసంగం' అన్న కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మ్యుఖ్య వక్తలైన గొటారి సంతోషి, బోటు స్వాతి మాట్లాడుతూ కుటుంబ విలువలు, పర్యావరణం పరిరక్షణ గూర్చి మహిళలకు వివరించారు.. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన కళలకు మరింత ప్రోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతిభావంతులైన, ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ, వారి కళారూపాలకు సముచిత వేదిక కల్పించేందుకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. ఏదైనా కళారూపంలో అనుభవం కలిగి పోటీలు, ప్రదర్శనల్లో ఇదివరకు పాల్గొన్న కళాకారులు తమ పూర్తి వివరాలను కళాకారుల నమోదు ఫారం ద్వారా అందజేయాలని కలెక్టర్ కోరారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు అవకాశం కల్పించడం జరిగిందని, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి తదితర మీడియాలో తమ వీడియోల ద్వారా ప్రజలను ప్రభావితం చేసే వారు కూడా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని అన్నారు. కళాకారుల ఫారాల కొరకు 99499 96497 మొబైల్ నెంబరుకు ఫోన్ చేసి ఉచితంగా పొందవచ్చని, పూరించిన వివరాలను manyamsam-skruthi@gmail.com మెయిల్ లేదా 99499 96497 ఫోన్ నెంబరుకు వాట్సాప్ చేయవచ్చని అన్నారు. నమోదు చేసుకునే ప్రతిభ కలిగిన కళాకారులను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నామని, వారితో ప్రతి పక్షం రోజులకు ఒకసారి సాహిత్య, సాహితీ, సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సైతం కళాకారుల్లో దాగిఉన్న కళా ప్రతిభను వెలికితీసి, ప్రజల మన్ననలు పొందేలా అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లా సంస్కృతిని, సాంస్కృతిక కళారూపాల గొప్పతనాన్ని చాటిచెప్పడం దీని ముఖ్యోద్దేశ్యమని తెలిపారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత ముందుకు రావాలని, తమ పేర్లను ఎక్కువగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులను జనవరి 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసా పత్రాలను అందించి సత్కరించడం జరుగుతుందన్నారు. కళలకు, కళాకారులకు జిల్లా ఎప్పుడూ పెద్ద పీట వేస్తుందని, యువతరం తమ కళలను పెంపొందించుకోవడానికి, ప్రొఫెషనల్ స్థాయికి చేరుకోవడానికి ఇది గొప్ప అవకాశంగా మారుబోతుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని జిల్లాలోని కళాకారులు, విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

విశాఖపట్నం వేదికగా డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న అఖితభారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు పిలుపునిచ్చారు. మంగళవారం కురుపాంలో గల కాంప్లెక్స్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగునాయుడుతో కలిసి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు ఆలిండియా మహాసభలు మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని ఉద్యమాల ఖిల్లా పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు భారతదేశవ్యాప్తంగా కాకల తీరిన కార్మిక నాయకులు ప్రపంచ దేశాల నుంచి కార్మిక నేతలు హాజరుకానున్నారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చర్చించడం జరుగుతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం కార్మికులను దగా చేయడమేనని, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని అన్నారు. మరో వైపు నిత్యవసర వస్తువులు పెట్రోల్, డీజిల్, గ్యాస్ మొదలైనటువంటి ధరలను నిరంతరం పెంచుతూ విద్య, వైద్యం పూర్తిగా వ్యాపారం చేశారని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో చెప్పుకోదగ్గ పరిశ్రమల్లేవని, ఉన్న షుగర్ ఫ్యాక్టరీ, సాలూరు జ్యూట్ ఫ్యాక్టరీ, మూతపడాయని అన్నారు. దీంతో జిల్లా నుండి వేలాది మంది పొట్ట చేత పట్టుకుని వలసలు పోతున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలి, భవన నిర్మాణ, ఆటో, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం పోరాడుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.సీతారాం, మండంగి శ్రీనివాసరావు, పువ్వుల తిరుపతిరావు, సంగం నాయుడు, పాండు, అశోకు, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యత కలిగిన సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రతి కార్మిక, ఉద్యోగ, మేధావులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమాప్రభ, జిల్లా కమిటీ సభ్యులు కాదరాము, అర్థముడి లక్ష్మణరావు, నులకజోడు ప్రసాద్, గొర్లి జగన్, కార్మిక సంఘాల నాయకులు ఎం.వీరనాయుడు, కృష్ణ, రజనీ, చిట్టెమ్మ, రొయ్యభారీ, పి.రమాదేవి, ఎస్.సంతోషి, పడాల ప్రసాద్, ప్రజాసంఘాల నాయకులు జి.శారద, దూసి దుర్గారావు, ఎం.లక్ష్మణరావు, కొండ గొర్రె భాస్కర్‌రావు, ఆరిక భాస్కర్ రావు, కె.విన్నా రావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే అఖిలభారత సిఐటియు 18వ జాతీయ మహాసభల్లో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాలూరులో వై.గౌరీశ్వరి, జి.కృష్ణారావు అధ్యక్షతన సిఐటియు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై చర్చించడం జరుగుతుందని, ఈ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున కార్మిక వర్గం కదిలి రావాలని పిలుపునిచ్చారు. అలాగే మేధావులు, ఉద్యోగులు, సంస్థలు మహాసభల జయప్రదానికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చొక్కాకు సుశీల, తుపాకుల వెంకటరావు, రవి, గిరిజన సంఘం జానకీరామ్, సిఐటియునాయకులు ఆలూరు రాధా, చోడిపల్లి సుశీల, పవన్ కుమార్, సురేష్, కృష్ణ, క్రాంతి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఫుడ్ స్టాల్స్, ఆటో నిర్వాహకులతో సమావేశం

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో అద్దె ప్రాతిపదికన ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసుకొని నిర్వహించేందుకు, ఆటో నిర్వాహణకు దరఖాస్తులు చేసుకున్న నిర్వాహకులు బుధవారం ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కుకు హాజరుకావాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ లోపల ఫుడ్ స్టాల్స్, సీతంపేటకు వచ్చే పర్యాటకులను ఆటోలో తిప్పుటకు ఆసక్తి కలిగిన ఆటో నిర్వాహకులు హాజరుకావాలని తెలిపారు.

నీలం వలస జలపాతాన్ని డిఆర్‌డిఎ పీడీ పరిశీలన

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని నీలంవలస సమీపాన గల జలపాతాన్ని డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధా రాణి సిబ్బందితో కలిసి మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పర్యాట కులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటకుల సౌకర్యార్థం మహిళా లబ్ధిదారులను గుర్తించి రుణం మంజూరు చేసి పాన్ షాప్ పెట్టించాలని ఎపిఎం రెడ్డి శ్రీరాములుకు సూచించారు. గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పర్యాటకులకు అవగాహన కల్పించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు మండలంలో అన్ని జలపాతాలు పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి, వెలుగు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, డిఆర్‌డిఎ డిపిఎంలు జయశ్రీ, ధర్మారావు, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, బంగారమ్మ, స్త్రీనిధి ఎజిఎం కామరాజు తదితరులు పాల్గొన్నారు.



నీలంవలస జలపాతాన్ని పరిశీలిస్తున్న పీడీ సుధారాణి

రుచికరమైన భోజనం అందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థులకు చదువుతోపాటు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డిజిఎస్‌వి త్రినాథ్‌ను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదువుకోగలరని, తద్వారా మంచి ఫలితాలు కూడా సాధించగలరని, ఆ దిశగా విద్యార్థులపై దృష్టి సారించాలని అన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు.

టిడిపి కార్యాలయానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గ కేంద్రమైన పాలకొండలో టిడిపి కార్యాలయ నిర్మాణానికి 50 సెంట్లు ప్రభుత్వ స్థలం లీజు ప్రాతిపదిక కేటాయించి స్థలం ఇవ్వాలని సబ్ కలెక్టర్ స్వప్నల్ జగన్నాథ్ పవర్‌ను నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవి మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. పాలకొండలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, అందుకు సహకరించాలని కోరారు.

వాటర్ ట్యాంక్ మంజూరు చేయండి

కలెక్టర్‌కు సర్పంచి వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం గ్రామానికి లక్ష లీటర్లు సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని సర్పంచి బి.గౌరీశంకర్రావు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిని అందించారు. గ్రామంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన 20వేల లీటర్ల రక్షిత మంచినీటి పథకానికి చెందిన ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నామన్నారు. మూడు విభాగాలుగా విభజించి రెండు రోజులకొకసారి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలన్నారు. స్పందించిన కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఇఇ, జెఇలకు ఆదేశాలు జారీ చేశారు.


సంతకాలను సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

గడపగడపకూ కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాం పరిధిలో గల 15, 18 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేయడానికి వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్లు చీకటి అనురాధ, సువ్వాడ లావణ్య, ఎగిరెడ్డి భాస్కరరావు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎపి దిశను మార్చే వేదిక సమ్మిట్

ప్రజాశక్తి - సీతంపేట

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్మాక వేదిక సిఐఐ సమ్మేట్‌ను పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడిల హబ్‌గా మార్చేందుకు సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎంతో శ్రమిస్తున్నారన్నారు. తద్వారా ఆర్థిక అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అన్నారు. భవిష్యత్తు తరాల కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు పిల్లలకు వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థిని, విద్యార్థులు యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పార్వతి, స్కూల్ అసిస్టెంట్లు శివకుమార్, పాణిగ్రహి, నీలవేణి, ఎ.గౌరీశంకర్, భారతి, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం


సారాతో పట్టుబడ్డ నిందితుడు

మండలంలోని పెద్దగొత్తిలి పంచాయతీలో గల చప్పగొత్తిలిలో నీలకంఠాపురం ఎస్సై ఎ.నీలకంఠరావు మంగళవారం కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించగా బిడ్డిక సుగన్న (36) అనే వ్యక్తి నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా ఎవరైనా అమ్మినా, తరలించినా, తయారుచేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

పాలకొండ : మండలంలోని సింగన్నవలస కూడలి వద్ద 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ మొబైల్ టీం సిఐ వెంకటపతిరాజు తెలిపారు. మంగళవారం ఉదయం సారాను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ మొబైల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

గిజబలో రబీ డ్రై షోయింగ్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గిజబలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబందకులు ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు ఆధ్వర్యాన మంగళవారం రబీ డ్రై షోయింగ్ చేపట్టారు. ఈ గ్రామానికి చెందిన రైతులు మిరియాల హరిబాబు, మండల అనసూయ, భవాని, శ్రీనుకు చెందిన 2.30ఎకరాల విస్తీర్ణంలో పంట మార్పిడి విధానంలో మినుములతో పాటు కంది, ఆముదం, సజ్జ, జొన్న, గోరుచిక్కుడు, గోంగూర, ముల్లంగి, గోంగూర మొదలగు పంటలను పరిశీలించారు. అనంతరం శ్రావణ్‌కుమార్‌నాయుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించడానికి, భూమిని సారవంతం చెందడానికి, పురుగులు తెగుళ్లు రాకుండా ఉండడానికి, పంటలు అధిక దిగుబడులు సాధించడానికి పంట మార్పిడి విధానం ఏకైక మార్గం అన్నారు. ఈ విధంగా వేసుకోవడం వల్ల రసాయనికి ఎరువులు, పురుగు మందులు వాడుకుంటా, పెట్టుబడి లేకుండా, పంటల దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని, రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతుందని అన్నారు. అలాగే అరటిలో కూడా అంతర పంటలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎ శారద, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రసాద్, వెంకట నాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

స్థానిక హెచ్ క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 జిల్లా స్థాయి బాలబాలికల వాలీబాల్ క్రీడా ఎంపికలను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడా ఎంపికలను ప్రారంభించారు. బాల బాలికలు స్నేహపూర్వకంగా ఎంపికలో పాల్గొనాలన్నారు. అండర్-14 బాల బాలికలకు ఈనెల 18న వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేయనున్నామని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు డివిజన్ల (విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి)లో గల పాఠశాలల నుంచి బాల బాలికలు పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన జట్లు గుంటూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కద్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, ఎంఇఒ-2 భీముడు, తహశీల్దార్ శేఖరం, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కె.నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి పి.చంద్రమోహన్, పార్వతీపురం డివిజన్ ఇన్‌ఛార్జి వైకుంఠరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షులు వాసుదేవరావు, కురుపాం నియోజకవర్గ గేమ్స్ ఇంచార్జ్ మాధవరావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ మాధవరావు, సురేష్, గిరి, మురళి, నాయకులు దామోదర్ రావు, రాజు, భాస్కర్ రావు, రామారావు, చిన్న, రాజేష్, రాజు, జయంత్, రామారావు, కామేష్, సురేష్, బాలు, దొరబాబు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన బొంగు జాహ్నవి

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కొమరాడకు చెందిన బొంగు జాహ్నవి ఎంపికైంది. ఈమె కొమరాడ జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. జాహ్నవి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే అండర్-17 ఖోఖో పోటీల్లో నక్కెట్ల తేజ ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన మండల, జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థిని, విద్యార్థి ఎంపిక కావడంతో పిఇటి నాగమణి, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఐక్య పోరాటాలతో మోడీకి బుద్ధి చెప్పాలి : సిపిఐ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

దళిత, బహుజన, గిరిజనులంతా మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటంతోనే మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, జన గణనలో కుల గణన చేపట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ జనగణలో కులగణన చేపట్టాలని, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం తదితర అంశాలపై దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి గత 11 ఏళ్లలో దళిత, గిరిజన, మైనార్టీ, వర్గాలపై దాడులు మితిమీరి పోయాయన్నారు. రాజ్యాంగం, మానవ హక్కుల, సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రా తత్వాన్ని మోదీ ప్రభుత్వం పాతర వేసిందని ఆయన విమర్శించారు. భారత రాజ్యాంగ్యాన్ని, ప్రజాస్వామ్య హక్కులను హరించే దుష్టశక్తులను తిప్పికొట్టేందుకు దళితులు, గిరిజనులు, బహుజనులు, మైనార్టీలు ఐక్యమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్వీఎస్ కుమార్, జిల్లా సమితి సభ్యులు సింహాద్రి కిరణ్ కుమార్, సింగన్న, చీపురుపల్లి విజయ్ కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రోత్సాహంతోనే ఆక్రమణలు : సిపిఎం

వరహాలగెడ్డ పోరంబోకు స్థలంలో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయవద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రోత్సాహంతోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వరహాల గెడ్డ పోరంబోకు స్థలంలో, నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయొద్దని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ప్రధానంగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రోత్సాహంతోనే పట్టణంలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోయాయని, ఫలితంగా పట్టణ ప్రాంతంలో పలు కాలనీలు, నివాస గృహాలు తరచూ ముంపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోపి నీటి ప్రవాహాలైన గెడ్డలు, నీటి సమూహాలైన చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే భవన నిర్మాణ అనుమతుల్లో కచ్చితంగా వరహాల గెడ్డకు ఆనుకొని ఉన్న స్థలాల్లో నిర్మాణాలు చేపట్టకుండా నిరోధించాలని, చెరువు గర్భాలలో నిర్మాణాలకు పరిమితులు విధించాలని డిమాండ్ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం నాయకులు విమర్శించారు. ఇప్పటికైనా పట్టణ సమగ్రాభివృద్ధికి భవన నిర్మాణాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, లోకాయుక్తలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు స్పందిస్తూ వరహాల గెడ్డ పోరంబోకు స్థలంలో ఎలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే ప్రసక్తి లేదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు సమస్యను విన్నవిస్తున్న సిపిఎం నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం/సీతానగరం

పార్వతీపురం మండలం తాళ్లబురిడి, సీతానగరం మండలం నిడగల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బి.విజయచంద్ర మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వమే చేపడుతుందన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులను అందజేస్తూ, కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు కళాసీ, రవాణా చార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తూ రైతు భారాన్ని మోస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించిన రైతులకు గతేడాది కొన్ని గంటల్లోపే రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారని, ఈ ఏడాది కూడా ఒకటి, రెండు గంటల్లోగా నగదు జమయ్యేలా పిపిసి కేంద్రాల సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, సీతానగరం తహశీల్దార్ ప్రశాంత్‌కుమార్, ఎంపిడిఒ ప్రసాద్, పౌరసరఫరాల, వ్యవసాయ శాఖల అధికారులు, టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, జి.చంద్రమౌళి, కోట శ్రీధర్, స్వచ్ఛ భారతి స్టేట్ డైరెక్టర్ బొమ్మినేని లక్ష్మణరావు, సీతానగరం మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల నాయకులు, రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత తాళ్లబురిడిలో గల ఎన్టీయార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు.

గరుగుబిల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసు కోవడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని ఎంపిపి ఉరిటి రామారావు పిలుపునిచ్చారు. స్థానిక పిఎసిఎస్ ఆవరణలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యం సేకరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దింటి పూర్ణచంద్రరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని కోరారు. రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మర్రాపు పురుషోత్తమునాయుడు, బిసి సెల్ కార్యదర్శి మరడాన తవిటినాయుడు, మండల టిడిపి కన్వీనర్ మరడాన నారాయణస్వామి, నాయకులు ముదిలిబాబు విజయవాంకుసం, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు, రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), నీటి సంఘం అధ్యక్షులు పల్ల పాపినాయుడు, రౌతు రామినాయుడు, పెద్దింటి శ్రీధర్, నల్ల శ్రీరాములునాయుడు, పెదిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, బోను చంద్రశేఖరరావు, అక్కేన రామకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి టి.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.


సీతానగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు



సాలూరులో నషా ముక్త్ భారత్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి దేశాన్ని విముక్తి చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని స్థానిక మున్సిపాల్టీలో మంగళవారం నిర్వహించారు. కమిషనర్ టిటి రత్న కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అనేది భారతదేశాన్ని మాదకద్రవ్యాల వ్యసనం నుండి విముక్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన దేశవ్యాప్త ప్రచార కార్యక్రమమని తెలిపారు. ముఖ్యంగా యువతపై మాదకద్రవ్యాల ప్రభావం తీవ్రంగా ఉందని, ఈ అలవాటు కారణంగా ప్రజలు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ వ్యసనానికి ఎవరూ అలవాటు పడకుండా జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ అటువంటి వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను, పారిశుద్ధ్య కార్మికులను కోరారు. మన ఆరోగ్యం, మన కుటుంబాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలని పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ సచివాలయ సెక్రటరీలు, శానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మాదక ద్రవ్యాలు ఉపయోగించడం వల్ల మానవ మనుగడే ప్రమాదకరంగా మారుతుందని, తమ నిండైన జీవితాలను బలి చేసుకోవద్దని జిల్లా డిజేబుల్ సూపరింటెంట్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎస్‌విడి కళాశాలలో నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా లక్ష్మణరావు, డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ శాంత కుమారి, జిల్లా ఈగల్ సెల్ సభ్యుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ర్యాలీ కార్యక్రమం నిర్వహించి మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఈగల్ సెల్ సభ్యులు కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ, వైద్యాధికారులు

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) యాంటీ బయోటిక్స్ మందులకు స్పందించకుండా వాటి సామర్థ్యాన్ని నిర్వీర్యం చేస్తూ అంటువ్యాధుల చికిత్సను మరింత కష్టతరం చేస్తుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. వరల్డ్ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో డిఎంహెచ్ఒ పాల్గొని ఎఎంఆర్‌పై అవగాహన కల్పించి తగు సూచనలు చేశారు. సరైన సూచనలు, నిర్దేశించిన ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారం యాంటీబయాటిక్స్ వాడకం వల్ల రోగకారక సూక్ష్మజీవులపై ఆ మందుల ప్రభావం క్రమేణా తగ్గి నిష్ఫలమౌతాయని అన్నారు. ఇలా కొనసాగితే రోగుల ఆరోగ్య భద్రతకు గణనీయమైన ముప్పు వాటిల్లుతుందని, ఈ సవాలును ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. యాంటీ బయోటిక్స్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అంతా భాగస్వాములు కావాలన్నారు. నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించకుండా, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎఎంఆర్‌కు సంబంధించి వర్తమానాన్ని కాపాడుకోండి - భవిష్యత్తుని భద్రపర్చుకోండి స్లోగన్స్ నినదించారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ వై.విజయ్ మోహన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయపార్వతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డాక్టర్ రఘుకుమార్, డాక్టర్ కౌశిక్, వై.మణి, సూపరింటెండెంట్ కామేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందీ మంచ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ప్రజాశక్తి - పాలకొండ


సిఎస్ నాయుడును సన్మానిస్తున్న హిందీ భాషాభిమానులు

జాతీయ భాష హిందీ అభివృద్ధికి గత మూడు దశాబ్దాలుగా సిఎల్ నాయుడు (పాలకొండ) విశేష కృషి చేస్తున్నారని హిందీ ప్రచార సభ కేంద్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి అన్నారు. హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖలోని మధురవాడలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల హిందీ సదస్సులో సిఎల్ నాయుడును హిందీ మంచ్ సంస్థ ద్వారా ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రముఖ న్యాయవాది జెవి నరసింహారెడ్డి మాట్లాడుతూ వందలాదిమంది ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయులను తయారు చేసిన ఘనత సిఎల్ నాయుడుదని అన్నారు. హిందీ మంచ్ వ్యవస్థాపకులు కోనే శ్రీధర్ మాట్లాడుతూ ఎపి హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న సిఎల్ నాయుడు రాష్ట్రమంతటా హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. సదస్సులో భాగంగా సిఎల్ నాయుడును ప్రతినిధులు శాలువ కప్పి, జ్ఞాపిక, పుష్పగుచ్చంతో సత్కరించారు. ఈ సందర్భంగా సిఎల్ నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో హిందీ పండిట్ ట్రైనింగ్ కాలేజీల పునరుద్ధరణకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు రాష్ట్రంలో హిందీ భాష అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మన్మథరావు సిద్ధాంతి, హిందీ ప్రచార సభ కన్వీనర్ చొంగ శివానంద్, ఉపాధ్యాయ పండిత పరిషత్తు నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, హిందీ మంచ్ శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్షులు కనుగుల సత్యం, విజయనగరం జిల్లాశాఖ అధ్యక్షులు పి.ఉమా బాల, మూడు జిల్లాల కమిటీల ప్రతినిధులు, హిందీ భాషాభిమానులు పాల్గొన్నారు.

తడి చెత్తను ఎరువుగా ఉపయోగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తడి చెత్తను కంపోస్టుగా మార్చి ఎరువుగా ఉపయోగించి ఆదాయాన్ని పొందాలని స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ శిక్షకులు వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశ మందిరంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలోని మెప్మా రిసోర్స్ పర్సన్‌కు ఒక రోజు శిక్షణ ఇస్తూ, వ్యర్థాలను వేరు చేయడం, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షన్, తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చడం ఆ కంపోస్ట్‌ను తిరిగి టెర్రస్ గార్డెన్లు ఎరువుగా వేయడం అన్న అంశాలపై ఒకరోజు పూర్తిస్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ నుంచి శిక్షకులుగా వెంకటేశ్వరరావు, మన్యం జిల్లా కోఆర్డినేటర్ గణపతమ్మ, విజయనగరం జిల్లా కోఆర్డినేటర్ నారాయణమ్మ, శ్రీకాకుళం జిల్లా కోఆర్డినేటర్ దేవి శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు శిక్షణా తరగతులను ప్రారంభిస్తూ ప్రతి ఆర్‌పి తమ సామర్థ్యాలను ఎల్లవేళలా మెరుగుపర్చుకోవాలన్నారు. బెస్ట్ ప్రాక్టీసెస్ నేర్చుకుంటూ తన వృత్తిలో తమదైన ముద్రను వేసుకోవాలని, అందుకు ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కావున ఈ శిక్షణ తరగతులు వినియోగించుకోవాలన్నారు. శిక్షణా తరగతులను విజయవాడ నుంచి స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ ఎండి, ఆర్‌డిఎంఎ, సిడియయు యూట్యూబ్ లైవ్ సహాయంతో ప్రత్యక్ష పర్యవేక్షణ చేసి కార్యదర్శులకు స్వచ్ఛభారత్, స్వచ్ఛ పార్వతీపురం కొరకు దిశా నిర్దేశం చేశారు.

రహదారులు ఇలా.. రాకపోకలు ఎలా..?

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బ తినడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తుపానుకు ముందు ఎంతో కొంత నడిచేందుకు వీలుగా ఉన్న రహదారులు కూడా పూర్తిగా కోతకు గురవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు నరకయాతన పడుతున్నారు. మక్కువ, సాలూరు మండలాలకు చెందిన సుమారు 20 గ్రామాలు ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే మార్కొండపుట్టి వద్ద చిట్టి గడ్డ వంతెన పూర్తిగా దెబ్బతింది. వంతెన మధ్యలో భారీ రంధ్రాలు ఏర్పడడంతో నాలుగు చక్రాల వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ద్విచక్ర వాహనాలైన భయంతో నడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని అధికారులు చెబుతున్నప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎస్ పెద్దవలస పంచాయతీ పరిధిలోని సిబిల్లి వేరాడవలస కాముడువలసకు వెళ్లే రహదారి బాగా దెబ్బ తినడంతో ఆ ప్రాంత గిరిజనలు చాలా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చిట్టి గడ్డ వంతెనను, పెద్దవలస సమీపంలో ఉన్న రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పెద్దవలస సమీపంలో పాడైన రహదారి

28న ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 28న ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. నవంబర్ 28న కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు గ్రీవెన్స్ ప్రారంభమవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు (రిటైర్డ్) ఇందులో పాల్గొని తమ సమస్యలను ఈ గ్రీవెన్స్‌లో దరఖాస్తులను అందజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.